అతను ఎలాగైనా బ్రతకాలి అంకుల్ అన్నాడు విహారి డాక్టర్ కృష్ణమూర్తి మొహం కడుక్కుంటున్నాడు. పేషెంట్‌ని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్ళారు అని ఫోన్ వచ్చింది.

అతడు బ్రతికితే ఒక అంతర్జాతీయ ముఠా బయటపడుతుంది అంది ప్రవల్లిక.

కృష్ణమూర్తి కళ్ళజోడు పెట్టుకున్నాడు.

ఏం చేసైనాసరే అతడు మాట్లాడగలిగేట్టు చేయాలి అతడికి మీరు ప్రాణం పోయాలి అంకుల్.

వెళ్ళబోతున్న డాక్టర్ అడిగాడు డాక్టర్లకి ఒకరు ముఖ్యం ఇంకొకరు కాదు అని లేదు ప్రమాదంలో వున్న ప్రతి వాడికీ ఒకేలా ప్రాణం పోయడానికి ప్రయత్నిస్తారు అన్నాడు క్లుప్తంగా.

విహారి ఏదో మాట్లాడబోతుంటే పద్మాకర్ వద్దు అన్నట్టు సైగ చేశాడు తండ్రి విషయం పద్మాకర్‌కి బాగా తెలుసు అంతలో ఫోన్ మ్రోగింది.

డాక్టర్ కృష్ణమూర్తి హియర్ అన్నాడు రిసీవరు ఎత్తి.

డాక్టర్ ఇప్పుడు మీరు ఆపరేషన్ చేయడం కోసం హాస్పిటల్‌కు వెళ్ళబోతున్నారు కదూ.....

అవును.

ఆ పేషెంట్ బ్రతక్కూడాదు.

నాన్సెన్స్ మీరెవరు?

ఆ పేషెంట్ బ్రతికితే నష్టపోయేవాళ్లం ఫోన్‌కట్ అయింది.

దాని గురించి పట్టించుకోనట్టు కృష్ణమూర్తి వెళ్ళి కారు ఎక్కాడు. ఆరుగంటల పాటు జరిగే ఆపరేషన్ అని విహారి ప్రవల్లికలు వుండనవసరం లేదని చెప్పాడు డాక్టర్ పద్మాకర్ దగ్గర శలవు తీసుకుని విహారి ఇంటికి బయల్దేరాడు. అతడి మూడ్ సరీగ్గా లేదు. టెర్రరిస్టూ బ్రతకాలి బ్రతికితే అంతకన్నా కావాల్సింది లేదు.

..... డాక్టర్ కృష్ణమూర్తి కారు ఆస్పత్రి మెట్లముందు ఆగింది. లోపలికి పొడవాటి వరండా ..... డ్రైవర్ డోరుతీసి పట్టుకున్నాడు. డాక్టర్ లోపలికి వెళ్ళబోతుంటే రిసెప్షనిస్టు సార్ మీకు ఫోన్ అంటూ అందించింది నమ్రతగా.

మరీ ఆపరేషన్ పూర్తిచేస్తే మీరూహించని నష్టాన్ని ఎదుర్కొనవలసి వస్తుంది డాక్టర్ తర్వాత చింతించి లాభం లేదు అట్నుంచి వినబడింది.

మీరెవరు? సరిగ్గా రిసెప్షన్ దగ్గర కొచ్చేసరికి అందేటట్టు ఫోన్ చేసిన వారి కాలిక్యులేషన్‌కి అబ్బురపడుతూ అడిగాడు.

మాక్కావల్సిన పనిచేయించు కోవడం కోసం కావాలంటే లక్షల కొద్దీ డబ్బుని లక్షలమంది రక్తాన్ని వెదజల్లగల వాళ్ళం. మీకేది కావాలో నిర్ణయించుకోండి.

మా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం లేదు మీరొచ్చి వెదజల్లితే సంతోషమే.

[illegible] వద్దు డాక్టర్ చింతిస్తారు

నా ప్రాణాలు ధారపోసైనా ఆ పేషెంట్‌ని రక్షిస్తాను.

అటువాంటి పక్షంలో ప్రాణం కన్నా విలువైనది వదులుకోవలసి వస్తుంది కృష్ణమూర్తి విసురుగా ఫోన్ పెట్టేశాడు.

ఇక్కడ ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి విహారి తన ఇంటిలోకి ప్రవేశించాడు. కృష్ణమూర్తి ఆపరేషన్ థియేటర్ ముందున్న గదిలో గ్లవ్స్ తొడుక్కున్నాడు. థియేటర్ ముందు ఆపరేషన్ ప్రారంభం కాబోతున్నట్టు రెడ్‌లైట్ వెలిగింది. ఆయన థియేటర్‌లోకి ప్రవేశించ బోతుంటే నర్స్ ఫోన్ తీసుకొచ్చింది అర్జెంట్ అట సర్ అంటూ.

ఆయన విసుగ్గా ఫోన్ తీసుకున్నాడు.

ఆఖరిసారి హెచ్చరిస్తున్నాను అయిదు నిమిషాల్లో పేషెంట్ చనిపోయినట్టు వార్త బయటకు రాకపోతే మీ కొడుకు పద్మాకర్ శవాన్ని అదే టేబుల్‌మీద పోస్టుమార్టమ్ చేస్తారు మీ డాక్టర్లు.

షటప్ అని నర్స్ వేపు తిరిగి ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా ఫోన్‌లు తీసుకొచ్చి ఇచ్చే సంస్కృతిని మీరెప్పటి నుంచి నేర్చుకుంటున్నారు? అడిగాడు.

ఆమె వణికిపోతూ సారీ డాక్టర్ అంది.

ఆయన చేయి సాచేడు.

అనెస్తిటిస్టు రెడీ అన్నట్టు తలూపాడు.

ఆపరేషన్ ప్రారంభమైంది.

* * *

ఆఖరుసారి హెచ్చరిస్తున్నాను అయిదు నిముషాల్లో పేషెంటు చనిపోయినట్టు వార్త బయటకు రాకపోతే నీ కొడుకు పద్మాకర్ శవాన్ని అదే టెబుల్ మీద పోస్టుమార్టం చేస్తారు మీ డాక్టర్లు అని ఫోన్ పెట్టేసి మరో నెంబర్‌కి ఫోన్ చేశాడు పరమేశ్వరం.

అయిదు నిమిషాల్లో A5 మరణించినట్టు ఆస్పత్రినుంచి వార్త బయటకు రాకపోతే ఆ డాక్టరు కొడుకుని ..... అంటూ సూచనలు ఇచ్చాడు.

అట్నుంచి ఏదో ప్రశ్న.

అవును తన పేరు పద్మాకర్ అంటూ ఫోన్ పెట్టేస్తూ గుమ్మం దగ్గర నిలబడిన వ్యక్తిని చూసి ఉలిక్కిపడ్డాడు.

ఎంత సేపట్నుంచి వున్నాడో తెలీదుగానీ గుమ్మం దగ్గర విహారి వున్నాడు. అతడి మొహం పాలిపోయింది దిగ్భ్రమంతో నిండివుంది ..... తాను విన్న మాటలు నిజమా కాదా నమ్మలేనట్టు అతడి శరీరం కంపిస్తూంది.

నా ..... న్నా ..... అన్నాడు వణికే స్వరంతో నాన్న అన్న మాటకి అర్థమే మారిపోయినట్టుంది ఆ సంబోధన మొత్తం బోధపడినట్టుంది. సర్వం తెలిసినట్టుంది.

కుడిభుజం..... మూలస్థంభం ..... పరమేశ్వరం.

తన తండ్రి .....

ఏదో అనబోయి ఆగిపోయాడు. అయిదు నిమిషాల టైముంది తన స్నేహితుడిని బ్రతికించుకోవడానికి శుష్కవాదనలకు సమయం లేదు.

గాలిలా బయటకు దూసుకుపోయాడు. నాలుగు నిమిషాల్లో అతడి వాహనం పద్మాకర్ ఇంటిముందు కీచుమని శబ్దంచేస్తూ ఆగింది. లోపలికి పరుగెత్తాడు, పద్మాకర్ గదిలోకి వెళ్తూంటే నౌఖరు అన్నాడు - "చిన్నబాబు గారు లేరు బాబూ. ఇప్పుడే ఫోనొస్తే బయటకు వెళ్ళారు."

షాక్ తగిలినట్టు అయింది.

పద్మాకర్ శత్రువుల ట్రాప్‌లోకి వెళ్ళిపోయాడు ..... ఎలా దీన్ని ఆపడం?

క్షణాలు గడిచేకొద్దీ అతడి మనసులో భయం ఎక్కువవుతోంది. ఎక్కడినుంచి ఫోన్ వచ్చిందో తెలీదు. అతడు ఎటు వెళ్ళాడో తెలీదు. అన్యమనస్కంగా వచ్చి కారులో కూర్చుని, ఒక గమ్యం లేకుండా పోనివ్వసాగాడు. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. చూస్తే ఆస్పత్రి ముందు వున్నాడు.

పార్కింగ్ ప్లేస్‌లో కారాపుచేసి, లోపలికి వెళ్ళాడు.

లోపల వరండాలో ప్రవల్లిక నిలబడి థియేటర్‌లోనుంచి రాబోయే వార్తకోసం ఎదురు చూస్తుంది. ఆపరేషన్ ప్రారంభమై అప్పటికే మూడు గంటలు అయివుంటుంది. ఆమె కళ్ళు చుట్టూ పరిసరాల్ని శత్రువులను పరిశీలిస్తోంది. వాళ్ళప్పుడే డాక్టరుని హెచ్చరించారు, ఆమె ప్రమాదం గ్రహించి వెంటనే ఆస్పత్రికి వచ్చేసింది. డాక్టరు వారి మాట వినలేదని వాళ్ళకు తెలిసిన మరుక్షణం , అప్రూవర్ ప్రాణాలు ప్రమాదంలో పడతాయి.

పోలీసుల సహాయం తీసుకోవడం ఆమెకిష్టం లేదు. విహారి మాటలు ఆమె మనసులో ఇంకా మెదులుతూ వున్నాయి. ఈ సాక్షిని తమ దగ్గిరే వుంచి, స్వామి ఆట కట్టించాలను కుంటూంది. ఆమె ఆలోచనలలో వుండగానే విహారి లోపలికి వచ్చాడు.

ఆమె అతడిని చూసి విస్మయంతో "అలా వున్నారేం?"అని అడిగింది.

అతడు సమాధానం చెప్పకుండా ఆమె ముఖంలో చూశాడు. అతడి మనసంతా అదోలాటి కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. అది కృతజ్ఞత కూడా కాదు. దానికన్నా వేరే ఏదో .....

ఈమెకు తన తండ్రి ఎటువంటివాడో తెలుసు. వాళ్ళ జీవితాలకు అతడు ఎంతో ద్రోహం చేశాడు. అయినా తన ఆనందాన్ని పాడుచేయడం ఇష్టంలేక ఆ విషయం చెప్పలేదు. తన తండ్రి గురించి చెడుగా మాట్లాడలేదు .....

..... ఆమె మళ్ళీ ఏదో అడగబోతూ వుండగా ఆపరేషన్ థియేటర్‌పై ఎర్రలైటు ఆరిపోయింది. డాక్టరు దయానంద కృష్ణమూర్తి ముఖం తుడుచుకుంటూ బయటకు వచ్చాడు. బయట నిలబడ్డ ఇద్దరివేపు చూసి ఆపరేషన్ సజావుగా జరిగినట్టు తలూపాడు.

* * *

"అర్జెంట్‌గా రమ్మ"ని ఫోన్‌చేస్తే పద్మాకర్ హడావుడిగా వచ్చేసేడేగానీ, అతడికి అక్కడెవరూ కనబడలేదు.

ఎవరో అమ్మాయి.

తనక్కూడా సునాదమాలలాంటి అమ్మాయెవరయినా ఫోన్ చేసిందేమోనని హడావుడిగా బయల్దేరాడు.

పార్కు నిర్మానుష్యంగా వుంది. మిట్టమధ్యాహ్నం పన్నెండు కావస్తూంది. తననెవరో ఏడిపించాలనుకుని అతడు తిరిగి బయలుదేరాడు. దూరంగా ఎవరో దసరా వేషంలో పులి డాన్సు చేస్తున్నాడు.

తనకి ఫోన్ చేసిన అమ్మాయి కంఠాన్ని ఇంతకుముందు ఎప్పుడయినా విన్నానా అని ఆలోచించసాగాడు. ఆలోచనల్తోనే మోటారు వేపు నడవసాగాడు. మరొక పులి వేషగాడు గేటు దగ్గరున్నాడు.

విజయదశమి దగ్గిర పడుతుందనుకున్నాడు. అంతే తప్ప దగ్గిర పడుతూన్న మృత్యువుని చూసుకోలేదు. ఇద్దరు ముగ్గురయ్యారు. ముగ్గురు నలుగురయ్యారు. వికృతంగా డాన్స్ చేస్తూ దగ్గిర కొచ్చారు. వాళ్ళ చేతుల్లో కత్తులున్నాయి. అప్పటికీ అతడికి అనుమానం రాలేదు. నవ్వుతూ జేబులోంచి పర్సు తీయబోయాడు. వెనుకనుంచి ఎవరో కత్తితో పొడిచారు. మోచేతి దగ్గర చీరుకుపోయింది. ఛివాలున వెనుక్కి తిరిగాడు. మళ్ళీ కత్తి ఎత్తాడా వ్యక్తి. పద్మాకర్ వాడిని వెనక్కి తోశాడు. ఈ లోపున పక్కనుంచి ఎవరో డొక్కల్లో పొడిచారు. రక్తం జివ్వున చిమ్మింది. తూలిపోయాడు ..... మరో పోటు.

వాళ్ళు తన ప్రాణాలు తీయటానికి వచ్చారన్న సంగతి అర్థమైపోయింది. కారణమే తెలియదు. చాలా దారుణమైన, నిస్సహాయమైన పరిస్థితి - ఎవరు చంపుతున్నారో, ఎందుకు చంపుతున్నారో తెలియక పోవడం.

పులివేషగాళ్ళు మళ్ళీ చుట్టుముట్టారు.

పద్మాకర్ తన శక్తినంతా చేతుల్లోకి తీసుకున్నాడు. మరణం ఎలాగూ ఖాయమని తెలిసిపోయింది. హఠాత్‌గా విజృంభించి ఒకని చేతిలో కత్తి లాక్కొన్నాడు. అవతలివాడు దీన్ని ఊహించేలోపలో వాడి మెడమీద పొడిచాడు. వాడి ఆర్తనాదం పార్కులో ప్రతిధ్వనించింది. ఈ లోపులో వెనుకనుండి ఎవరో పద్మాకర్‌ని వెన్నులో మరోసారి పొడిచాడు. ప్రాణాలు పోతున్నట్టు తెలిసిపోతోంది. పద్మాకర్ వెనుతిరిగి అదే ఊపులో రెండోవాడి గుండెల్లో కత్తి దింపాడు.

పద్మాకర్‌తో సహా ఇద్దరు దుండగులు కూలిపోయారు మిగతా వారు వెళ్ళిపోయారు. కొన్ని రోజుల క్రితం ఇదే సీనులో "నటించారు" ఇప్పుడు పడివున్నాడు ఒక్కొక్క ప్రాణమే పోతూంది.

కళ్ళు మూయటానికి ప్రయత్నించాడు రెప్పలు సహకరించలేదు. ప్రాణం పోవడం అంటే ఏమిటో అర్థం అవుతూంది అతడికి. దుఃఖం రాలేదు. విహారి గుర్తువచ్చాడు. స్నేహం, నాటక సమాజాలు, బాల్యం, యవ్వనపు తొలి రోజులు - అన్నీ గుర్తువచ్చాయి. ఎవరో రచయిత అన్నట్టు మరణం అంటే ఏమిటి? మనం తప్ప మిగతా ప్రపంచం అంతా వుండడం..... ! తననెవరు చంపేరో, ఎందుకు చంపారో కూడ తెలీదు అతడికి. చిన్నప్పుడు చనిపోయిన తల్లి గుర్తువచ్చింది. పెంచి పెద్ద చేసిన తండ్రి గుర్తువచ్చాడు. ఆయన తనని చూస్తే బతికించగలడా? అంత పెద్ద డాక్టరు బ్రతికించలేడా? అయినా ఈ పార్కులో తమ శరీరాల్ని ఎంతసేపటికి చూస్తారు? అప్పటికి ప్రాణం ఎంతదూరం పయనించి వుంటుంది? తన తండ్రికూడా వెనక్కి తీసుకురాలేనంత. అన్నట్టు తను స్వర్గానికెళతాడా? నరకానికా? ఇంకొద్ది క్షణాల్లో తెలుస్తుంది కదా ఎందుకంత ఆతృత?

అతనికి నవ్వొచ్చింది.

నవ్వులోనే ప్రాణం పోయింది.

## *15*

***వరండాలో*** నిలబడ్డ విహారి, డాక్టరు కృష్ణమూర్తి దగ్గిరకు వెళ్ళాడు. “ ..... సాయంత్రానికి స్పృహ వస్తుంది. అయితే రెండు మూడు రోజుల వరకూ మాట్లాడించక పోవడం మంచిది” అన్నాడు కృష్ణమూర్తి.

“అతను మన దగ్గరున్న విషయం సీక్రెట్‌గా వుంచాలి డాక్టర్” అంది ప్రవల్లిక.

డాక్టరు తలూపేడు.

ఈ ల్లోపులో A-5ని తీసుకొస్తున్న స్ట్రెచరు వాళ్ళ దగ్గకొచ్చింది. ఆ చూపులో సంతృప్తి వుంది. ఎన్నోగంటలు కష్టపడిన చేతివేళ్ళ శ్రమ, నైపుణ్యం మెదడు తాలూకు ఏకాగ్రత, వృత్తిపట్ల కృతజ్ఞత - ఆ చూపులో వున్నాయి. కేవలం డాక్టర్లకే తెలుస్తుంది ఆ సంతృప్తి.

స్ట్రెచరు స్పెషల్ గదివేపు వెళుతోంది.

ఎదురుగా మరో స్ట్రెచరు వస్తూంది.

కృష్ణమూర్తి నుదుట ముడత పడింది. మళ్ళీ ఇంకో ఆపరేషన్?

“అవసరం లేద”న్నట్టు ఆ స్ట్రెచరు అతడి ముందు ఆగింది.